# చుట్టుపక్కల చూడరా!



## – కర్లపాలెం హనుమంతరావు

### సమకాలీన సమస్యలపై వ్యంగ్యాస్త్రాల పరంపర!!

*13*

## <u>ప్రేమపార్టీ జిందాబాద్</u>

**"ప్రేమే దైవం.. యువతే లక్ష్యం!"**

"ఇదివరకు సేవే లక్ష్యం అన్నట్లు గుర్తు. "

"అది ముగిసిపోయిన పార్టీ పాట్టికేష్టను బాబాయ్! ఇది ముందుకు దూసుకొస్తోన్న కొత్త పార్టీ నినాదం. ఇది ఆంధ్రప్రదేశ్ 'మార్పు' మాజీ పార్టీ. అది ఉత్తర ప్రదేశ్ మార్కు ప్రేమ పార్టీ. మాథుర్ నాథ్ చౌదరి సాబ్ గుర్తున్నాడా?"

"మర్చిపోదగ్గ మానవుడా! పాఠాలు చెప్పమని ఉద్యోగమిస్తే ప్రేమపాఠాలు చెప్పి ఓ శిష్యురాలిని ఏకంగా పెళ్ళిపీటల మీదకే ఎక్కించేసాడు. అప్పట్లో చాలా ఘన సన్మానాలూ అవీ జరిగినట్లు గుర్తు.. చెప్పుల దండలతో!"

"చెప్పు పడ్డంత మాత్రాన గొప్పతనమేమన్నా తగ్గిపోతుందా? ఆ మాటకొస్తే ఇప్పుడున్న నాయకుల్లో చెప్పుదెబ్బలు తినని వాళ్ళెవరున్నారో!"

"సర్సెరే ఇప్పుడా చెప్పుల పురాణమెందుగ్గాని నువ్వు చెప్పాలనుకున్నదేంటో చప్పున చెప్పెయ్యరా నాయనా!"

"మా మాధుర్ చౌదరీ ప్రేమ గురూజీ ప్రేమ పార్టీ పెట్టి 'హృదయం' గుర్తుతో ఎన్నికల బరిలోకి దిగాడిప్పుడు. దడదడలాడించేస్తున్నాడు అలహాబాదు నియోజక వర్గాల్లో తెగతిరుగుతూ.. తెలుసా?"

"ఆహా.. ఎన్నికల జాతర మొదలవగానే ఇట్లాంటి గారడీలు ఎన్నో జరుగుతుంటాయిలే. గారడీలా? ఇన్నాళ్ళ బట్టీ జనాల్ని పట్టించుకోకుండా ఇప్పుడొచ్చి పెద్ద 'ఆహారభద్రత, ఉపాధి హామీ పథకాలంటూ' గారడీలు చేస్తున్న దెవ్వరంట? అవినీతి అంటే మాకొళ్ళు మంటంటూ గంగ వెర్రులెత్తే వాళ్ళు పక్క పార్టీ తిని పారేసిన పళ్ళ తొక్కల్ని కడిగినోట్లో వేసుకోబోవడం 'గారడీ'కాదా బాబాయ్?"

"బాబోయ్! టీవీ చర్చా కార్యక్రమంలో లాగా ఈ భాషేంటిరా బాబూ? సరే. నీ ప్రేమ పార్టీ చేసే ప్రజాసేవేంటో చెప్పుకోనాయనా అదీ వింటాం"

"దేశాన్నిప్పుడు పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యలేంటీ?"

"కూడూ, నీడా.."

"ఒక్క ఓటుతో అన్ని సమస్యల్నీ చిటికెలో మాయం చేస్తుంది మా ప్రేమ పార్టీ. ప్రేమకు ఆకలిదప్పులుండవుగదా! ఇంక ఆహార సమస్యేముంది? రూపాయికి కిలోబియ్యాల్లోంచీ గారడీలు చెయ్యాల్సిన పనే ఉండదు. తాగునీటి కోసం తమిళనాడు, కేరళ తరహాలో తన్నుకుచావడాలసలే ఉండవు. ప్రేమలో పడ్డోళ్ళకి ఎదుటివాడి గుండెల్లో కాస్తంత చోటుంటే చాలనుకుంటారు. ఇందిరమ్మ ఇళ్ళూ.. ఎమ్మార్ కుంభకోణాల్లాంటి వాటికింక చోటేముంది బాబాయ్!

ప్రేమికులకు మన మామూలు భాషతో పనేలేదు బాబాయ్! వాళ్ళదంతా ఒక మూగభాష. భాషల పేరుతో మరాఠీ, కన్నడం వాళ్ళు బెల్గాంలాంటి చోట చేసుకునే ఆగడాలకింక ఆస్కారమే ఉండదు. ప్రేమ త్యాగాన్ని తప్ప మరేదీ కోరుకోదు. కొడుకులకీ, కూతుళ్ళకీ కూడబెట్టి ఇవ్వాలనీ, తాము పోయిన తర్వాత తమ సంతానమే దేశాన్నంతా ఏలుకోవాలని తాపత్రయాలు పడటం వల్లనే కదా ఇప్పుడీ జరుగుతున్న కుంభకోణాలు, కుమ్మలాటలూ, వెన్నుపోట్లూ, వెన్న రాయడాలూ. ప్రేమికుల సంఖ్యను పెంచి పారేస్తే 'కావాలి..కావాలి' అనే గోల మానేసి 'ఇవ్వాలి..ఇవాలి' అనే కొత్త నినాదం మొదలవుతుంది. ఇప్పుడు జరుగుతున్న ఈ హక్కుల పోరాటాలన్నీ అప్పుడు చప్పున మూతబడతాయి."

"కన్యాశుల్కం గిరీశంగాడి ఉపన్యాసంలాగుందిరా నీ వాగుడు. ఇన్నిన్ని వార్తాపత్రికలు చదువుతుంటానూ.. నన్నే గందరగోళంలో పడేసేటట్లుందే నీ తర్కం. ఇంక మామూలు ఓటరు మాయలో పడితే ఏంకాను? మాయావతి, రాహుల్ గతి, అఖిలేష్ బాబు, కమలనాబుల డాబు.. అందరి పనీ అధోగతేనా.. మీ మాథుర్ నాథ్ ప్రేమపార్టీ పెద్ద మాయలమరాఠీ ముఠాలాగుందే! ప్రేమతో పార్టీ ఏందిరా!"

"ఏళ్ళబట్టి బూర్జువా పార్టీల తత్వం వంటబట్టిన నీ బోటి వాళ్ళకి ప్రేమంటే మందులో కాస్త చేదుమందులాగే ఉంటుంది కానీ.. బాబాయ్. నిజానికి జనాలకి కలిగే ప్రయోజనాలు మా పార్టీవల్ల ఇంక చాలా చాలా చాలా ఉన్నాయ్"

"అదెలా బాబూ?"

"ఇప్పుడు నడుస్తున్నవన్నీ కులరాజకీయాలేనా కాదా? మతప్రాతిపదిక మీద మంత్రాంగం నడిపించటం మన నేతలు ఎప్పుడో మర్చిపోయారు. ప్రేమజీవులకి కులమతాలతో అసలు సంబంధమే ఉండదు. దేశ పురోగతికి అందుకే మా ప్రేమ పార్టీని మించిన దిక్కులేదు ఏమంటావ్?"

"ఏమనమంటావ్? నీ దూకుడుకి నా మైండ్ బ్లాకయిపోయినట్లుందిరా భడవా.. ముందు కాస్త నన్ను తేరుకోనీయరా.. పుణ్యముంటుంది."

"ఆ దూకుడు లేకే అన్నాహజారే జీ అన్ని తిప్పలు పడుతున్నాడు. లోక్‌పాల్ బిల్లుని పట్టుకుని పార్లమెంటు వెంటబడేకన్నా.. అదీ మా మాథుర్ నాథ్ కన్నా ముందే ఏ ప్రేమ పంథానో పట్టుకుని యువతలోకెళ్ళి ఉంటే ఈ పాటికి ఢిల్లీ పీఠం అల్లల్లాడిపోయుండేది కాదా! రామ్‌దేవ్ బాబా ఆ యోగాని పట్టుకుని వేళ్ళాడేకన్నా.. ఇలా ఏ ప్రేమాసనాల వంకతోనో సభలు గనక పెట్టుంటే హస్తిన నుంచీ తరిమెయ్యడానికి సర్కారు తాతలు దిగొచ్చేవాళ్ళు. ఇప్పటికయినా మించిపోయింది లేదు. మా ప్రేమ పార్టీతో పొత్తులు పెట్టుకుంటే ఎవరికైనా ఎన్నికల్లో విజయం తథ్యం. మా లక్ష్యాలు నెరవేరడానికి మేం బొంత పురుగులనూ ముద్దు పెట్టుకోడానికెప్పుడూ సిద్ధం"

"ఏంటి బాబూ అంత మీ లక్ష్యాలు?"

"ప్రేమకోసం జీవితాలని అర్పించిన అమరజీవులు దేవదాసు, పార్వతి, లైలామజ్ను, ఏంటోనీ - క్లియోపాత్ర, రాజకపూర్ - నర్గీస్ లాంటి వాళ్ళ విగ్రహాలను పార్లమెంటు ప్రాంగణంలో ప్రతిష్ఠించాలి. ప్రాథమిక దశనుంచే పసిపిల్లలకు ప్రేమ మహిమను గురించిన కథలను పాఠ్యపుస్తకాలద్వారా బోధించాలి. ప్రేమను ప్రధానంగా బోధించే కళాశాలలను గుర్తించి ప్రోత్సహించాలి. ప్రేమ విరోధులకు విధించే శిక్షలను మరింత కఠినతరం చేయాల్సుంది. ప్రేమ వివాహాలను ప్రభుత్వమే తన స్వంత ఖర్చుతో ప్రేమికుల దినం రోజున జరిపించాలి. ప్రేమపక్షుల

విహారానికి అనువైన స్థలాలను ప్రభుత్వమే సేకరించి అభివృద్ధి చేయాల్సింది. విఫల ప్రేమికులకు సరికొత్త ప్రేమికులు దొరికేదాకా నెలవారీ ఖర్చుల కింద ప్రేమ భత్యం చెల్లించాలి. ఫ్లాపైన ప్రేమ చిత్రాలకు ఉద్దీపన పథకాలు, ప్రేమచిత్రాలు టీవీ సీరియల్సు నిర్మించేవారికి భారీ సబ్సిడీలు తక్షణావసరాలు. విఫల ప్రేమికులు సర్వప్రయత్నాలు దెబ్బతిని విరక్తితో ఆత్మాహుతి చేసుకోదలిస్తే దూకేందుకు వీలుగా కాలువలు, ప్రత్యేక రైలుమార్గాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రారంభంలో ప్రేమికుల చేత పళ్ళురాలగొట్టించుకునే ఔత్సాహికులకి ఉచిత చికిత్సా సౌకర్యాలు.. దంత వైద్యశాలలు ఏర్పాటు చేయించాలి. అన్నట్లు ప్రేమికులకు పరిమితిలేని - ఉచిత సెల్ ఫోన్ కాల్సు సౌకర్యం విధిగా కల్పించాలి.."

"అసల్ది మర్చిపోయావురా అబ్బాయ్! మీ మాధుర్ నాథ్ చౌదరి సాబ్‌కి చెప్పించి 'ప్రేమ పార్టీ' మేనిఫెస్టోలో చేర్పించాల్సిన ముఖ్యమైనవి ఇంకా రెండున్నాయి. ప్రేమికులందరికీ వికలాంగుల కోటాలో ప్రభుత్వోద్యోగాలు ఇవ్వాలి. ప్రేమగుడ్డిది కదా! మీది గుడ్డివాళ్ళ పార్టీ కదా! పిచ్చాసుపత్రుల సంఖ్య మరిన్ని పెంచాలి. "

Post your comments